

పండుగకు అందరం ఒకేచోట..



వివాహమై 30ఏళ్లయినా సద్దుల బతుకమ్మ పండుగను తోబుట్టువులతోనే జరుపుకోవడం ఎంతో సంతోషాన్నిస్తుంది. ఈసారి సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలను రామగుండంలోని నా సోదరి ఇంట్లో అందరం కలిసి జరుపుకునేందుకు నిర్ణయించుకున్నాం. అందరం ఒకేచోట కలుసుకుని కష్టసుఖాలు పంచుకుంటాం.

– రమాదేవి

ఎంతో ఆనందాన్నిస్తుంది



రామగుండం: నా భర్త ఉద్యోగ రీత్యా కమలాపూర్‌లో ఉంటున్నాం. కానీ ఏటా సద్దుల బతుకమ్మ వేడుకలను గోదావరిఖనిలోని మా సొంతింట్లోనే జరుపుకుంటాం. బంధువులు, మిత్రులు, ఇరుగుపొరుగు వారితో కలిసి పండుగ జరుపుకోవడం మనసుకు ఎంతో ఆనందాన్నిస్తుంది.

– నలుమాచుల సునీత

తోబుట్టువులతో వేడుక



రామగుండం: నేను రామగుండం హైస్కూల్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నాను. ప్రతీ ఏటా సద్దుల పండుగ సెలవుల్లో నా తల్లిగారిల్లు మంచిర్యాల జిల్లా దండెపల్లి మండల కేంద్రంలోనే వేడుకలు జరుపుకుంటాం. తోబుట్టువులు అందరం ఒకే చోట కలుసుకోవడంతో పండుగ వాతావరణం ఏర్పడుతుంది.

– అజ్మీరా శారద, రామగుండం

క్లుప్తంగా

వైభవంగా మహా చండీహోమం



మంథని: మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడ దుర్గా సంస్థాన్‌లో ఆదివారం మహా చండీ హోమం వైభవంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా జరిపించిన హోమంలో పలువురు జంటలు కూర్చొని హోమం చేశారు. గురుస్వాములు భద్రయ్య, అరవింద్ బృందంతో హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కొట్టె పద్మ– రమేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఐలి ప్రసాద్, బీజేపీ పట్టణాధ్యక్షుడు సబ్బని సంతోష్ దంపతులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు, భజన

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో పూజారి శ్రవణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల గుండా ఆదివారం రథోత్సవం నిర్వహించిన తర్వాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో భజన చేయించారు. విజయదశమి వరకు ప్రతీరోజు భజన ఉంటుందని ఆయన తెలిపారు.

గుండెవ్యాధుల నివారణ దినోత్సవ ర్యాలీ

యైటింక్లయిన్‌కాలనీ: ప్రపంచ గుండెవ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రామలక్ష్మి పాల్గొని గుండె వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం నివారణకు పాటించాల్సిన నియమాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ కాలనీ పురవీధుల గుండా ర్యాలీని నిర్వహించారు. శ్రీసత్య సాయి సేవాసమితి కన్వీనర్ నూక రమేశ్, కిష్టయ్య, మల్లేశ్, శ్రీనివాస్, హర్షిత్‌రెడ్డి, రాజయ్య, సమ్మయ్య, లింగమూర్తి, మంజుల, రజిత, బాలవికాస్ పాల్గొన్నారు.

పూల పండుగకు ఏర్పాట్లు



కొలనూర్‌లో విద్యుత్ దీపాలంకరణ

ఓదెల: మండలంలో సోమవారం జరిగే సద్దుల బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు చేశారు. మండలంలోని కొలనూర్, ఓదెల, పొత్కపల్లి, కనగర్తి, గుంపుల, ఇందుర్తి గ్రామాలతో పాటు 22 గ్రామాల్లో బతుకమ్మ పండుగకు ప్రత్యేక లైట్లు ఏర్పాటు చేశారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు



శుభ్రం చేస్తున్న కార్మికులు

సుల్తానాబాద్: సద్దుల బతుకమ్మ వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బతుకమ్మ ఘాటుతో పాటు చెరువులు, కుంటల్లో ఉన్న నాచుతోపాటు చెరువుల వద్ద లైట్లు ఏర్పాటు చేశారు. బతుకమ్మ ఆడే ప్రాంతాన్ని చదును చేయడమే కాకుండా గుర్రపు డెక్కను తొలగించారు. విద్యుత్ దీపాలతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. విద్యుత్, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వైద్యసేవలు అందుబాటులో ఉండనున్నాయి. పట్టణంలో నిమజ్జనం ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రమేశ్ తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ చెందిన యువకులు 11వ సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈనెల 25 నుంచి 28 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన పోటీల్లో 12 జిల్లాల నుంచి 12జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. వీరిలో 5–4 పాయింట్ల తేడాతో వనపర్తి జట్టు విన్నర్‌గా నిలవగా కరీంనగర్ జిల్లా జట్లు రన్నర్‌గా నిలిచింది. ఉత్తమ గోల్ కీపర్‌గా కాలనీకి చెందిన అరుణ్, ఉత్తమ స్కోరర్‌గా కాలనీకి చెందిన రాంచందర్ నిలిచారు. ఈ జట్టులో కాలనీకి చెందిన శివ, అబ్దుల్, ప్రదీప్, అత్యంత ప్రతిభ చూపి ఉమ్మడి కరీంనగర్ జట్టును రన్నర్ స్థానంలో నిలిపారు.

కుంకుమ పూజలు.. హోమాలు



రామగుండం: ఎ-పవర్‌హౌస్ వద్ద మండపంలో..



ఓదెల: పూజల్లో దాసరి మనోహర్‌రెడ్డి



సుల్తానాబాద్‌రూరల్: పూజల్లో పాల్గొన్న భక్తులు



ధర్మారం: హోమంలో పాల్గొన్న భక్తులు



జూలపల్లిలో కుంకుమ పూజలు



ఎలిగేడు: ధూళికట్టలో కుంకుమపూజలు



కమాన్‌పూర్: బాపూజీనగర్‌లో కుంకుమ పూజలు

సుల్తానాబాద్‌రూరల్/కమాన్‌పూర్/జూలపల్లి/ఎలిగేడు/ధర్మారం/ఓదెల/రామగుండం/పాలకుర్తి: దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా నెలకొల్పిన దుర్గామాతలకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల్లో మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పంచ పరివర్తన్‌తో హిందువుల ఐక్యతకు కృషి



సమావేశానికి హాజరైన స్వయం సేవకులు

ధర్మారం: హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ కృషిచేస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ తూరాప్ఠి చంద్రశేఖర్ జీ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా ధర్మారం మండల ఆర్‌ఎస్‌ఎస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రశేఖర్ జీ మాట్లాడుతూ దేశ అభివృద్ధి కోసం హిందువులు పంచ వరివర్తన్ కోసం పాటుపడాలని ఆయన సూచించారు. డాక్టర్ కామిని శ్రీనివాస్ మాట్లాడుతూ హిందుత్వ పరిరక్షణకు చేపడుతున్న చర్యలు అందరూ స్వాగతించాలని కోరారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్వయం సేవకులు, స్థానికులు పాల్గొన్నారు.

చికాగోలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాల్లో మహిళలు

కాల్వశ్రీరాంపూర్: పూలను పూజించే తెలంగాణ బతుకమ్మ సంబరాలు అమెరికా చికాగోలోని నేపర్ విల్ పట్టణంలో తెలంగాణ అసోసియేషన్ నేతృత్వంలో కరీంనగర్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వాసులు ఘనంగా జరుపుకుంటున్నారు. బుతకమ్మలను తీరొక్క పూలతో అలంకరించిన మహిళలు ఉయ్యాల పాటలు పాడుతూ సందడి చేసినట్లు జమ్మికుంట పట్టణానికి చెందిన ఐటి ఉద్యోగులు సింధూజ–జగదీశ్వర్ దంపతులు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఓపెన్‌స్కూల్ పరీక్షకు ఒకే విద్యార్థి.. ఆలస్యంగా వచ్చాడని అనుమతి నిరాకరణ

పెద్దపల్లిరూరల్: జిల్లాలో జరుగుతున్న ఓపెన్ స్కూల్ పరీక్షల్లో ఆఖరి రోజున ఆదివారం జరిగే ఆటోమొబైల్ పరీక్షకు ఒకే ఒక విద్యార్థి హాజరు కావాల్సి ఉంది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే పరీక్షకు హాజరు కావాల్సిన అన్వేష్ ఉదయం గంటన్నర ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి వచ్చారు. అయితే సకాలంలో రాని కారణంగా లోనికి అనుమతించలేదు.

• అక్టోబర్ 5న ఖనిలో అలయ్.. బలయ్

గోదావరిఖనిటౌన్: దసరా పండుగను పురస్కరించుకొని ఏటా సామాజిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే అలయ్.. బలయ్ కార్యక్రమాన్ని అక్టోబర్ 5న స్థానిక సిరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు వేదిక కన్వీనర్ క్యాతం వెంకటరమణ తెలిపారు. కులమతాలకు అతీతంగా అందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆహ్వాన కమిటీని, కార్యదర్శులను ఎన్నుకున్నారు. నాయకులు రాయమల్లు, మధు, భాస్కర్, లింగయ్య, బొందయ్య, శ్రీనివాస్, మహేందర్, రాము, మధునయ్య, వీరేశం పాల్గొన్నారు.

• మున్నూరుకాపు భవన నిర్మాణానికి రూ.కోటి నిధులు ఇవ్వండి

మంథని: నియోజకవర్గ కేంద్రం మంథనిలో మున్నూరుకాపు సంఘం కార్యకలాపాల కోసం, డిజిటల్ లైబ్రరీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణం కోసం రూ.కోటి నిధులు కేటాయించాలని డివిజన్ మున్నూరుకాపు సంఘం నాయకులు కోరారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని ఒక హోటల్లో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందించారు.

భారత్ గెలుపుపై యువత సంబరాలు



సంబరాల్లో కొలనూర్ యువత

ఓదెల: ఆద్యంతం రసవత్తరంగా సాగిన ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించడంతో మండలంలోని కొలనూర్ యువత ఆదివారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి, జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. ఈ సంబరాల్లో యాపం ప్రదీప్, కారెంగుల శ్రీనివాస్, అంతగిరి సందీప్, యాసం సాగర్, అనమల్ల మహేశ్, కొల్లూరి సాయి, కారెంగుల నవీన్, అంతగిరి రఘు తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి భారీగా నిధులు



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పాలకుర్తి: రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగానే పాలకుర్తి మండల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు భారీగా నిధులు మంజూరు చేయించారని కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి అన్నారు. బసంత్‌నగర్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు, కమ్యూనిటీహాళ్లు, డ్రైనేజీలు ఇతరత్రా అభివృద్ధి పనులకు రూ.133కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. ఎల్కలపల్లి నుంచి ధర్మారం క్రాస్‌రోడ్ మీదుగా వేంనూర్ వరకు దాదాపు రూ.80కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారని తెలిపారు. మండలంలో రూ.2కోట్లతో ఏసీ ఫంక్షన్ హాల్, రూ.4కోట్లతో విమానాశ్రయం వరకు రహదారి నిర్మాణ పనులకు ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గంగాధరి రమేశ్, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి ముక్కెర శ్రీనివాస్, మల్లెత్తుల శ్రీనివాస్, దేవానందుల రాజమౌళి, పాత రవీందర్, తువ్వ సతీశ్, మాదాసు శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

మహిళా కార్మికులకు బతుకమ్మ సెలవు ప్రకటించాలి

రామగిరి: సింగరేణి కంపెనీలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు ప్రత్యేక సెలవు ప్రకటించాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సెంటినరికాలనీలో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగను అధికారిక పండుగగా గుర్తించి, పాఠశాలలు, కార్యాలయాలకు సెలవు ఇస్తుందని, వేలాది మంది మహిళలు పనిచేస్తున్న సింగరేణి బొగ్గు గనుల్లో బతుకమ్మ సెలవు అమలు కావడం లేదన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులు సింగరేణి యాజమాన్యంతో ఒకరోజు బతుకమ్మ సెలవు ప్రకటించేలా కృషి చేయాలని కోరారు. సింగరేణి యాజమాన్యం బతుకమ్మ పండుగ రోజును వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ పండుగను జాతీయ పండుగగా గుర్తించాలని త్వరలోనే కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామన్నారు.

నేడు ఆర్జీ-3 ఏరియాలో బతుకమ్మ సంబరాలు

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 6గంటలకు సెంటినరికాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలు నిర్వహించనున్నట్లు అధికార ప్రతినిధి బి.సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా బతుకమ్మ ఆటాపాటలు నిర్వహించడం కోసం తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఉత్తమంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 10 ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాలనీ మహిళలు అధిక సంఖ్యలో బతుకమ్మలతో వచ్చి ఈ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.


జోరందుకున్న పండుగ కొనుగోళ్లు



కంగన్ హాల్‌లో మహిళలు

సుల్తానాబాద్: సద్దుల బతుకమ్మ సందర్భంగా పూలకు మాత్రమే కాకుండా, దుస్తులకు కూడా గిరాకీ పెరిగింది. డిమాండ్ ఉండడంతో వ్యాపారులు పూలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కొత్త దుస్తుల కొనుగోలు, ఫ్యాన్సీ దుకాణాల్లో రద్దీ పెరిగింది. కంగన్‌హాల్‌లో కొనుగోళ్లు జోరందుకున్నాయి.

చికిత విజయం పట్టుదలకు నిదర్శనం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కొమురయ్య

ఎలిగేడు: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. కెనడాలో జరిగిన వరల్డ్ యూత్ ఆర్చరీ చాంపియన్ షిప్‌లో విజేతగా నిలిచిన చికిత ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో కలిశారు. ఎమ్మెల్సీ ఆమెకు రూ.లక్ష విలువగల చెక్కు అందజేశారు. తానిపర్తి చికిత సాధించిన విజయం మహిళల ఆత్మవిశ్వాసం, కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు. ఆటల్లో ఇంకా మెరుగ్గా రాణించి దేశఖ్యాతిని పెంచి తెలంగాణ కీర్తిని చాటాలని ఆయన ఆకాంక్షించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళలే మహారాణులు



ఓదెల: మహిళా సంఘ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళలు మహారాణులని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని కనగర్తిలో ఆదివారం మహిళా స్వశక్తి సంఘం భవనాన్ని ప్రారంభించారు. దీంతో పాటు సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కనగర్తిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసిన ఎమ్మెల్యే విజయరమణారావు చిన్నోడితో కలిసి నడవడం అందరినీ ఆకట్టుకుంది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ చొప్పరి రాజన్న, కాంగ్రెస్ నాయకులు గుండేటి మధు, ఉడిగె సదయ్య, శ్రీనివాస్, మహేందర్, ఏపీఎం సంపత్, కార్యదర్శి నహీం పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎలిగేడు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని ధూళికట్టలో రూ.30లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, కాపు కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ధూళికట్ట నుంచి రాములపల్లి నాగలింగేశ్వరాలయం వరకు రూ.12కోట్లతో బీటీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసి, లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అర్హులైన పేదలందరికీ విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో కిరణ్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ కొక్కిరాల మహేశ్వర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుగ్యాల సంతోష్‌రావు, మాజీ సర్పంచులు బాలుసాని పర్శరాములుగౌడ్, కావేరి, వెంకటేశ్వర్‌రావు, రాయనర్సయ్య, పర్శరాములుగౌడ్, ప్రసాదరావు, మండల కోఆప్షన్ మాజీ సభ్యులు ఎండీ.ఖలీల్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ నరహరి సుధాకర్‌రెడ్డి మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉపసర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి



మాట్లాడుతున్న వైవీరావు, మడ్డి ఎల్లాగౌడ్

గోదావరిఖని: గని ప్రమాదంలో మరణించిన కార్మికుల పిల్లలకు సూటబుల్ జాబ్ ఒప్పందం చేసుకున్న ఏఐటీయూసీపై ఆరోపణలు చేసి, నిరూపణకు, బహిరంగ విచారణకు హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ రాలేదని, అసత్య ప్రచారాలు మానుకోకపోతే కార్మికులే తగిన బుద్ధి చెప్తారని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీరావు, మడ్డి ఎల్లాగౌడ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 25న డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందంపై అవగాహన లేకుండా అవాకులు చవాకులు పేలిన రియాజ్ అహ్మద్ ప్రెస్‌క్లబ్ వద్దకు చర్చకు రావాలని సవాల్ చేసినా బహిరంగ విచారణకు రాలేదని ఎద్దేవా చేశారు. తమ యూనియన్‌పై బురద జల్లేలా కార్మిక వర్గాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాడన్నారు. కార్మిక సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం పాటుపడేది ఏఐటీయూసీ మాత్రమే అన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, ఆరెల్లి పోషం, జిగురు రవిందర్, మండల రాంచంద్రారెడ్డి, గౌతం గోవర్ధన్, మాదన మహేశ్, శ్రీను, సతీశ్‌బాబు పాల్గొన్నారు.

కుల, మత రహిత సమాజం కోసం పోరాడాలి



గోదావరిఖని: మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: కుల, మత రహిత సమాజం కోసం ఐక్యంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గోదావరిఖనిలో ఆదివారం కులనిర్మూలన వ్యతిరేక సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమున్నచోట పోటీ చేసేందుకు పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తోకల రమేశ్, గుమ్మడి వెంకన్న, ఇసంపల్లి రాజేందర్, గొల్లపల్లి చంద్రయ్య, కోడిపుంజుల లక్ష్మి, మార్త రాములు, కలువల రాయమల్లు, రాజు, అరుణోదయ ఓదెలు, నాని, రాజయ్య, సారంగపాణి పాల్గొన్నారు.

కులరహిత సమాజానికి పోరాడుదాం

జ్యోతినగర్: కులరహిత సమాజానికి పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కులనిర్మూలన సదస్సులో ఆయన మాట్లాడారు. నాయకులు చిలుక శంకర్ అధ్యక్షత వహించగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఈ.నరేశ్, జిల్లా నాయకులు రాజేశం, బుచ్చయ్య, కొమరయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

దేవతామూర్తులకు వెండి కిరీటాల బహూకరణ



వెండికిరీటాలు అలంకరించిన సదాశివరెడ్డి

కాల్వశ్రీరాంపూర్: మండలం మొట్లపల్లి శ్రీసీతారాంచంద్ర స్వామి, లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలకు గ్రామానికి చెందిన లంబవింధ్య సదాశివరెడ్డి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం వెండి కిరీటాలు బహూకరించారు. ఊరేగింపుగా రెండున్నర కిలోల వెండి కిరీటాలను ఆలయానికి తీసుకొచ్చి అర్చక పురోహితులు నిట్టూరి సతీశ్‌శర్మ స్వామివార్లకు అలంకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు తులా మనోహర్‌రావు, గోనె శ్యాం, ఆలయ కమిటీ చెర్మన్ దొమ్మటి రవి, కోశాధికారి భాస్కర్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సత్యశోధక్ సమాజ్ వ్యవస్థాపక దినోత్సవం

రామగుండం: మహాత్మాజ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈ.నరేశ్ మాట్లాడుతూ ఏటా సెప్టెంబర్ 24–30 తేదీల్లో సత్యశోధక్ వ్యవస్థాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ జిల్లా ప్రతినిధులు మేర్గు చంద్రయ్య, రాజేశం, జ్యోతి, మల్లేశ్, రమేశ్, మాజీ ఉప సర్పంచ్ భూమేశ్, తిరుపతి ఉన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

ఓదెల: ఓదెల గ్రామంలో ఒల్లాల మొగిలయ్యగౌడ్ అనే గీత కార్మికుడికి చెందిన నివసిస్తున్న ఇల్లు వర్షానికి శనివారం రాత్రి కూలింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఇల్లు నాని అకస్మాత్తుగా కూలడంతో గీత కార్మికుడు మొగిలయ్య ప్రాణాలతో బయటపడ్డాడు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వాన్ని కోరాడు.